విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

గ్యాస్ సిలిండర్ ధర పెంపు ఉపసంహరించుకోవాలి

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య డిమాండ్

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ **సిలిండరు ధరను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గంప లోవరత్నం డిమాండ్ చేశారు.** ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడలో గోకులం ఎదురుగా శనివారం మహిళా సమాఖ్య శాఖ కార్యదర్శి అప్పయ్యమ్మ ఆధ్వర్యంలో గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందరశిభంగా లోవరత్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజానీకం నడ్డి విరిచే విధంగా నిత్యవసర ధరలు విపరీతంగా పెంచుతోందన్నారు. అది సరిపోక ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచిందని, వంటింటి గ్యాస్ 50 రూపాయలు, కమర్షియల్ బండపై 350 రూపాయల పెంచి బడా కార్పొరేటర్లకు దోచి పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రెడ్డి బోడకొండ మాట్లాడుతూ కమర్షియల్ గ్యాస్ బండపై ధర పెంచడం వల్ల తినే పదార్థాలు అధిక ధరల ప్రభావం పడుతుందని, మోడీ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని, పెంచిన గ్యాస్ బండ ధరలను తక్షణమే తగ్గించకపోతే ప్రజల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గమ్మ, సుబ్బలక్ష్మి, పాపమ్మ, లక్ష్మీ, దుర్గ, సరోజ, పావని తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు స్వచ్ఛందంగా ఇంటి నిర్మాణానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర - చాగల్లు : జగనన్న కాలనీల్లో లబ్దిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత పేర్కొన్నారు. శనివారం చాగల్లు గ్రామంలో జగనన్న కాలనీ కొత్త లే అవుట్‌లను కలెక్టర్ పరిశీలించి, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ప్రతి ఒక్క లబ్దిదారుడు ప్రభుత్వం ఉచితంగా అందచేసిన ఇంటి స్థలంలో త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు మీకు అందచేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టకపోతే ఇతరులు ఆక్రమించుకోవడం గానీ, పక్క ఇంటి వారి ప్రహరీ గోడ మన స్థలంలో నిర్మించుకునే అవకాశం ఉందని అన్నారు. ఇంటి నిర్మాణం కొంత శ్రమతో కూడుకున్నా, మీ తరువాత వారసులకు ఒక ఆస్తి హక్కు కల్పించే చక్కని అవకాశం అన్నారు. ప్రభుత్వమే ఇంటి నిర్మాణం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఇసుక, ఇతర నిర్మాణ ముడిసరుకులు, నీటి వసతి కల్పించడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. మీరు ఇంటి నిర్మాణం చేపట్టడం జరిగితే, ఆమేరకు దశల వారీగా చెల్లింపులు కూడా ఎప్పటికప్పుడు మీ బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల వారీగా ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ అధికారి జి. పరశురామ్, ఎంపీడీవో బి బి. రాంప్రసాద్, ఇంచార్జ్ తహసిల్దార్ నిరంజన్ కుమార్, హౌసింగ్ ఏఈ - ఏడుకొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుర్జాన్, మండల గ్రీవెన్స్ ఆఫీసర్ బి. చక్రధర్, సచివాలయ సంక్షేమ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కల్తీ పదార్థాలపై అవగాహన పెంచుకోండి

విశాలాంధ్ర - కొత్తపేట : కల్తీ పదార్థాలు తిని ప్రజలందరూ అనారోగ్యాలు పాలవుతున్నారని వాటిపై అవగాహన పెంచుకోవాలని సిసిఐ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు సూచించారు. శనివారం కొత్తపేట జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో జాతీయ వినియోగదారుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సిసిఐ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు పాల్గొని మాట్లాడుతూ రంగులు వేయని ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలని, విద్యార్థులు తప్పనిసరిగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోని ఆహార పదార్థాలైన పిజ్జా, బర్గర్లు మంచూరియా, చికెన్ ఫ్రైడ్ రైస్, ఎగ్ ఫ్రైడ్ రైస్ తినే ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవద్దని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని అన్నారు. దీనివలన కల్తీ ఆహార పదార్థాలను తిని వినియోగదారులు ఆసుపత్రి పాలవుతున్నారని, వాటిపై అవగాహన పెంచుకుని వాటి వినియోగం తగ్గించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట కన్స్యూమర్ కౌన్సిల్ అధ్యక్షులు ఆదిత్య కిరణ్, జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ సమితి సభ్యులు హెచ్ఎన్ రామకృష్ణ, గొట్టిముఖల అనంతరావు, సిసిఐ రాష్ట్ర అధ్యక్షులు ఆడపురెడ్డి గోవిందు, కేంద్రం వినియోగదారు రాష్ట్ర కార్యవర్గ బాలకృష్ణ, బి. నాగేశ్వరరావు, పాఠశాల హెడ్ మాస్టర్ ఇందిర బాయ్, టీచర్ శంకర్ పాల్గొన్నారు.

పనికి వచ్చి చోరీకి పాల్పడిన మహిళ

మత్తు నీళ్లు ఇచ్చి 13 కాసుల బంగారం చోరీ

విశాలాంధ్ర - నిడదవోలు : అమ్మా ఇంటిలో పనిచేస్తాను పనుంటే చెప్పండమ్మా అంటూ పనిలో చేరిన మహిళ 13 కాసుల బంగారు వస్తువులు దోచుకెళ్లిన సంఘటన నిడదవోలులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. నిడదవోలు ఎస్సై పి. నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం నిడదవోలు శాంతినగర్లో కుమారుడు సిహెచ్.శ్రీనివాస్‌తో కలిసి నిడదవోలు కరూర్ వైశ్య బ్యాంక్ వెనుక జయలక్ష్మి నివసిస్తున్నారు. గురువారం ఉదయం కొవ్వూరు యస్. బి.ఐ బ్రాంచ్ లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేందుకు శ్రీనివాస్ వెళ్లగా పని చేస్తానంటూ వచ్చిన 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళను జయలక్ష్మి పని పెట్టుకుంది.సాయంత్రం వరకు పని చేసిన మహిళ మొదటి గా మత్తు మందు కలిపిన జ్యూస్ ను జయలక్ష్మి కి ఇవ్వగా ఆమె త్రాగింది. మత్తు సరిగా ఎక్కక పోవడంతో రెండోసారి మత్తుమందు కలిపిన త్రాగునీరు జయలక్ష్మి కి త్రాగించగా ఆమె మత్తులోకి జారుకుంది. అనంతరం 13 కాసుల బరువు గల జయలక్ష్మి మెడ లోని రెండు పేటల బంగారు గొలుసు, రెండు బంగారు గాజులు పని మనిషిగా చేరిన మహిళ దొంగలించుకుని పారిపోయిందని ఎస్సై నాగరాజు శుక్రవారం తెలిపారు.కుమారుడు సిహెచ్.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిడదవోలు ఎస్సై పి నాగరాజు కేసు నమోదు చేయగా సి.ఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిపిఎం నాయకుడు సోమ సుందరం మృతి

విశాలాంధ్ర-దేవరపల్లి: సిపిఎం నాయకుడు పిచ్చికుల సోమ సుందరం అనారోగ్యంతో మృతి చెందారు. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన సోమ సుందరం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. కమ్యూనిస్టులు విభజన తర్వాత సిపిఎం లో ఆయన కొనసాగుతూ అనేక ఉద్యమాలు పాల్గొన్నారు ముఖ్యంగా రైతు కూలీ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. సిపిఎం అగ్ర నాయకులతో సోమ సుందరంకు పరిచయాలు ఉన్నాయి. ఆయన మృతి చెందిన విషయం తెలియగానే జిల్లా నలుమూలల నుండి సిపిఎం నాయకులు తరలివచ్చి ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. సిపిఎం నేత ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ సోమ సుందరం మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. సిపిఎం నేతలు జువ్వల రాంబాబు, ఎం.సుందరబాబు, ఎస్. భగత్, ఎం. రామారావు, పిన్నమనే సత్యనారాయణ, కే. రత్నాజీ, అయినపత్తి శ్రీనివాస్, చాపల నీలం నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

త్రాగునీటిని వృథా చేయవద్దు

విశాలాంధ్ర - చాగల్లు : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటిని విడుదల చేస్తామని చాగల్లు పంచాయతీ కార్యదర్శి ఎల్. రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఆరవ తేదీ నుంచి ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు గ్రామస్తులు త్రాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పబ్లిక్ కులాయిల వద్ద దుస్తులు ఉతకరాదని, వాహనాలు కడగరాదని చెప్పారు. గ్రామపంచాయతీలో దిగువన ఉన్నవారికి నీరు అందకుండా అక్రమంగా మోటార్లు, ట్యూబులు పెట్టి నీటిని వాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి ప్రవేశాలు

విశాలాంధ్ర - గోపాలపురం : మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతికి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కన్వీనర్ ఎం. ఎస్ సాయినాథ్ తెలిపారు. శనివారం స్థానిక వెనుకబడిన తరగతుల గురుకుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం సాయినాథ్ విలేకరులతో మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి గోపాలపురం(బాలికలు) కొవ్వూరు(వాడపల్లి) బాలురు, రాజమండ్రి (బొమ్మూరు) బాలికలు అనపర్తి(మల్లంపూడి) బాలురు,5వ తరగతి ప్రవేశానికి గాను 3,4 తరగతులు ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే చదివి ఉండాలని, ఓసి బిసి మరియు ఈ బీసీ చెందినవారు 1-9 -2012 నుండి 31-8-2014 మధ్య జన్మించి ఉండాలని, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు1-9- 2010 నుండి 31- 8- 2014 మధ్య జన్మించి ఉండాలని ఆయన తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయము ఏడాదికి లక్ష రూపాయలు మించకుండా ఉండాలని తెలిపారు. అర్హులైన బాలికలు ఈనెల 6వ తేదీ నుండి ఏప్రిల్ నెల 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, రాత పరీక్ష ద్వారానే ఐదో తరగతి ప్రవేశం జరుగుతోందని అర్హులైన వారు ఇంటర్నెట్ సెంటర్ ద్వారా తమ దరఖాస్తులు ఆన్లైన్ చేసుకోవాలని కన్వీనర్ సాయినాథ్ తెలిపారు.

హౌసింగ్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో గ్రామాలలోని జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడివో నాతి బుజ్జి అన్నారు. శనివారం ర్యాలి గ్రామంలో జురుగుతున్న హెూసింగ్ నిర్మాణాల పనులు పరిశీలించారు. హెూసింగ్ నిర్మాణాలలో పురోగతి ఉండాలని లబ్ధిదారులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన కల్పించారు. మరియు వాడపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జరుగుతున్న రోడ్ల నిర్మాణం పనులు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ పరిశీలనలో ర్యాలి గ్రామమునకు హెూసింగ్ ఎఇ వి వెంకట రెడ్డి, వెలుగు ఎపియం, బి అప్పల కొండ, హౌసింగ్ వర్క్ ఇన్ స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, విఓఎలు, యానిమేటర్లు, డ్వాక్రా సిబ్బంది, వాలంటీర్లు, మరియు గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు. మరియు వాడపల్లి గ్రామంలో పంచాయితీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ మరియు విఆర్ఓ పాల్గొన్నారు.

సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - రాజోలు : ఎనిమిది సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్న సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలని సువర్ణ ఇండియా బాధితుల సంఘం అధ్యక్షుడు కాశీ వెంకట్రావు కోరారు. శనివారం రాజోలు అంబేద్కర్ భవనం నందు సువర్ణ ఇండియా బాధితుల సమావేశం జరిగింది. ఈ సంధ్బంగా వెంకట్రావు మాట్లాడుతూ 2011 సంవత్సరంలో శివకోటి గ్రామానికి చెందిన బూసిం నాగ వెంకట వేణు అమలాపురం కేంద్రంగా సువర్ణ ఇండియా సంస్థను స్థాపించి అధిక వడ్డీ ఆశ చూపి ఫిక్సిడ్, రికరింగ్ డిపాజిట్ల రూపంలో ప్రజల నుండి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 23 బ్రాంచ్‌లు స్థాపించి 12 వందల మంది ఖాతాదారుల నుండి సుమారు 12 కోట్ల రూపాయలు వసూలు చేసి 2013 సంవత్సరంలో కంపెనీ ఎత్తి వేశారు. గత్యంతరం లేక రెండు రాష్ట్రాల్లో ఉన్న బాధితులు 2015లో అమలాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు డైరెక్టర్లను అరెస్టు చేసి జైలుకు పంపారు. కంపెనీ పేరున అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురంలో ఉన్న రెండు బిల్డింగ్‌లు, అంబాజీపేట పుల్లేటికుర్రులోని, 48 సెంట్ల స్థలం, మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో నాలుగు ఎకరాలు, శివకోటి గ్రామంలో ఒక ఇల్లు, శ్రీకాకుళం జిల్లాలో 10 ఎకరాలు, మెదక్ జిల్లా నారాయన్ కేట్‌లో 140 ఎకరాలు అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కోర్టు ఆదేశాలతో సీజ్ చేసారు. ఇటీవల కంపెనీ ఎండీ వేణు, రీజనల్ మేనేజర్ మంగళంపల్లి అచ్యుత రామనాధం కోర్టు పరిధిలో ఉన్న భూములను ఒక్కొక్కటి అమ్మేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు సార్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి సువర్ణ ఇండియా బాధితులంతా మెమొరాండం సమర్పించామని అన్నారు. రెవిన్యూ,పోలీసు అధికారులు స్పందించి ప్రభుత్వం సీజ్ చేసిన భూములను స్వాధీనం చేసుకుని సువర్ణ ఇండియా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సువర్ణ ఇండియా బాధితుల సంఘం కార్యదర్శి కానూరి తులసీ రావు, కొంబత్తుల అనిల్, నాగాబత్తుల వెంకటరమణ, జి కృష్ణ, జి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కలిగి ఉన్న ముగ్గురి అరెస్ట్

విశాలాంధ్ర - ఆలమూరు : కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ ఇటుక బట్టీలు సమీపంలో గంజాయితో ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఆలమూరు ఎస్సై ఎస్ శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు స్థానిక ఇటుక బట్టీలలో కార్మికులుగా పనిచేస్తున్నారని ఎక్కువ ధనార్జన చేయాలని దురుద్దేశంతో గంజాయి రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు వీరిపై నిఘా వుంచి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుండి 21 కిలోల గంజాయిని స్థానిక తహసీల్దార్ ఐపీ శెట్టి సమక్షంలో స్వాధీన పరుచుకుని వీరిపై కేసు నమోదు చేసి రావులపాలెం సిఐ ఎస్ రజిని కుమార్ సమక్షంలో అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కలెక్టర్ గారు మమ్మల్ని ఆదుకోండి !

దివ్యాంగురాలి ఆవేదన

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి ముంగడవారి పేటలో తోకల పార్వతి, కూతురు 20 సంవత్సరాల నుండి గుడిసెలో నివసిస్తున్నారు. వర్షాకాలం నీరు, పాములు గుడిసెలోకి రావడంతో రేకుల షెడ్ ఇల్లు నిర్మాణం చేపట్టారు. గ్రామకంఠ స్థలంలో జీవిస్తున్నారని, ఇప్పుడు వెళ్లిపోమంటే మాకు చావే శరణ్యం అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి ఫిర్యాదు చేయడంతో మండల తహసీల్దార్ తక్షణమే పనులు ఆపేయాలని వీఆర్వోను పంపి చెప్పడంతో వికలాంగురాలు సొమ్మసిల్లి పడిపోయింది. గతంలో కలెక్టర్‌కి స్పందనలో ఆమె ఫిర్యాదు చేసింది.

మాట్లాడే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న

విశాలాంధ్ర-ఆలమూరు : మాట్లాడే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే సామెతను నిజం చేసారు ఈ దాతలు. మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన ముద్రగడ్డ యేసు రాజు కుమార్తె అరుణ కుమారి ఆరవ తరగతి చదువుతోంది. ఈ చిన్నారి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా ఈ బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు వెల్లడించారు. మెరుగైన వైద్యం అందించాలంటే మూడు లక్షల వరకు వైద్య ఖర్చులు అవుతాయని వైద్యులు తెలిపినట్లు యేసు రాజు తెలిపారు. చిన్నారి అనారోగ్య విషయం తెలుసుకున్న మండల పరిధి గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు రూ.5,000లు, పెదపళ్ళ వైయస్ఆర్‌సిపి నాయకులు నెక్కింటి వెంకట రాయుడు (బుజ్జి) రూ.5000లు ఆర్థిక సహాయాన్ని చిన్నారి తండ్రి యేసురాజుకి గుణ్ణం రాంబాబు చేతుల మీదుగా రూ.10,000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు వైయస్ఆర్‌సిపి నాయకులు నాతి కుమారరాజ, నాయుడు ప్రసాద్, ఆలమూరు మండల వైయస్ఆర్‌సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై అధికారులు దృష్టి పెట్టాలి

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో ఏర్పాటు చేసిన 28 లేఔట్లలో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులు దృష్టి పెట్టాలని కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు పెంకె శ్రీలక్ష్మీ సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కరప సెంట్రల్ లేఅవుట్‌లో 6,153 మంది లబ్ధిదారులకు జగనన్న గృహ నిర్మాణ పథకం ద్వారా పట్టాలు మంజూరు చేసినట్టు తెలిపారు. కరప ఒకటి రెండు మూడు లేఔట్లలో నిర్మాణాలు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహ నిర్మాణా లకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యాలను ఆ శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.స్వప్న, తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బొమ్మిడి వీర రాఘవులు, జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, ఎస్సై రామకృష్ణ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలు "స్త్రైడ్స్ 2023" నిర్వహణ

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో రోజులుగా నిర్వహిస్తున్న "స్త్రైడ్స్ 2023"లో భాగంగా ఈనెల 3వతేదీన ఇసిఇ విభాగం వారి "ఇ-జైవ్ 2023", సిఎస్ఎమ్ విభాగం వారి "ఇ-ఆరిఫ్యాక్ట్ 2023", ఐటి విభాగం వారి "ఎమిట్రిక్స్ 2023", సిఎస్‌డి విభాగం వారి "ఇ-డాటమ్ 2023", 4వతేదిన సివిల్ విభాగం వారి "ఎలెవెర్ 2023" ఇఇఇ విభాగం వారి "ఎక్స్ 2023" మెకానికల్ విభాగం వారు "ఎరుడైట్ 2021" సిఎస్ఇ విభాగం వారి "ఎం ఫ్రోజైన్ 2023"లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఇటువంటి సాంకేతిక సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విద్యలో ప్రయోగాత్మక పరిజ్ఞానం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడు తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ తెలియ జేసారు. ఈ సందర్భంగా వివిధ విభాగాధిపతులు మాట్లాడుతూ, స్త్రైడ్స్ 2023లో మొత్తం 5643 మంది విద్యార్థులు రిజిష్టరు అయ్యారని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాధబాబు, డైరక్టర్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకులు, ఈవెంట్ కో-ఆర్డినేటర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శుల సమావేశం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో నాతి బుజ్జి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల స్థాయి అధికారు లతో నిర్వహించిన మండల స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని అందరు సర్పంచులు, కార్యదర్శులు గ్రామాలలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవలసిందిగా సూచించారు. గ్రామవంలో పైపు లైన్లు రిపెర్సు, చేతి పంపు రిపేర్లు, పిడబ్ల్యూఎస్ స్కీమ్స్ రిపెర్సు చేయించి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడవలసినదిగా ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో త్రాగు నీటి సమస్యల ఫిర్యాదులు నిమిత్తము, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి మండల పరిషత్ కార్యాలయంలో మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఓ తెలియజేసారు. రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా సన్నద్ధత మరియు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చైర్మన్‌గా ఎంపిడిఓ ఎఇఇ(ఆర్‌డబ్ల్యుఎస్) కన్వీనర్‌గా, ఎఇఇ (ఎలక్ట్రికల్) మరియు ఇఓ (పిఆర్ & ఆర్‌డి) మెంబర్లుగా కమిటీని ఏర్పాటు చేయడమైనదని ఎంపిడిఓ తెలియజేసారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాతి బుజ్జి, ఎలక్ట్రికల్ ఎఇఇ కెబావిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇఇ, వై శ్రీధర్, విస్తరణాదికారి (పిఆర్ & ఆర్‌డి) శ్రీనివాస్, పాలొన్నారు.

మహారాజశ్రీ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కాకినాడ
O.S.No.682/2018
Between:
C.రత్నరాణి మరియు వగైరాలు ...వాదులు
మరియు
కోట నాగకుమార్ (died) మరియు వగైరాలు ...ప్రతివాదులు
To
R2: కోట కార్తిక్, S/o. (లేటు) నాగ కుమార్, లెక్చరర్, C/o. ది ప్రిన్సిపల్, కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజి, విజయవాడ.
R3: కోట శ్వేత, D/o. (లేటు) నాగ కుమార్, ఎంప్లాయీ, C/o. కోట కార్తిక్, R/o. Flat No.D3, 3rd Floor, రత్నాంజలి టవర్స్, నూకాలమ్మ గుడి వీధి, రామారావుపేట, కాకినాడ
పై నెంబరు దావాలో 2వ మరియు 3వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.09-03-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 నిII లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.V. లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, డో.నెం.6-1-9/1, దూసర్లపూడివారి వీధి, కాకినాడ. సెల్: 9866211196

ఏడుగురికి కారుణ్య నియామకాలు

విశాలాంధ్ర - కాకినాడ : కారుణ్య నియామకం కింద ఏడుగురికి ఉద్యోగ నియామక పత్రాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబీకులకు శనివారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఖాళీల సంఖ్య, రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్టు తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టరు కృతికా శుక్లా ఈ సందర్భంగా అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హక్కులపట్ల అవగాహన

విశాలాంధ్ర-గోకవరం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి పాన్ ఇండియా ప్రాజెక్ట్ లో భాగంగా "అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు" ను పురస్కరించుకుని మార్చి 4 నుండి 11 వరకు నిర్వహించ బడుచున్న న్యాయ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శనివారం తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి వి.వి.వి.ఎస్.ఎస్. కుమారి, మండల సమాఖ్య ప్రెసిడెంట్ జి.మానస, డి. ఆర్. డి. ఎ. అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇ. శ్యామ సుందర్, ప్యానల్ అడ్వకేట్ డీ.వెంకటేశ్వర రావు, పారా లీగల్ వాలంటీర్ ఇ. రాధాకుమారి పాల్గొని మహిళలకు హక్కుల పట్ల అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - మామిడికుదురు : అంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం (ఎపిసిఎన్ఎఫ్) ఆధ్వర్యంలో మామిడి కుదురు మండల పరిధిలోని ఈదరాడ గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, రసాయన వ్యవసాయం వల్ల కలిగే నష్టాలు గూర్చి వివరించారు. 365 రోజులు భూమిని కప్పి ఉంచే పద్ధతులు, పలుపంటల విధానం గూర్చి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మరియు విత్తన గుళికలు చేయు విధానము గూర్చి, వాటి ఉపయోగాలు రైతులకు వివరించారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజ కుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ పి జోసెఫ్ , సీయెచ్ రాధ, కే జానకి, ఏ వీరబాబు, సచివాలయం సిబ్బంది, హైస్కూల్ ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సత్యదేవా ఏజెన్సీస్ విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం వెంకన్న ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులుకు తన వంతు సాయంగా అమలాపురం పట్టణానికి చెందిన సత్యదేవా ఏజెన్సీస్ అధినేత వేటుకూరి సుబ్బరాజు, కృష్ణంరాజు సోదరులు రూ.40 వేలు విరాళంగా ఇచ్చారు. దీనిని ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు వినియోగించాలని అన్నారు. ఈ చెక్‌ను శనివారం ఆలయ ధర్మకర్తల సమక్షంలో ఛైర్ పర్సన్ దూడల విరీతదేవికి అందచేసారు. అనంతరం సుబ్బరాజు కృష్ణంరాజు సోదరులకు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయ నిర్మాణానికి ఇలాంటిదాతల సహకారం మారువలేనిదని దాతలవల్లే అన్నిసౌకర్యాలు కల్పిస్తున్నామని. దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని విరీతదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవ్వాల రాజేష్, వైకాపా యువజన అధ్యక్షులు దూడల ఫణి మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులు నడింపల్లి వర్మ, ముంగర ప్రసాద్ ఈఓ డి. సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గళ్లలో మంచి నీటి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - సీతానగరం : ముగ్గళ్ల గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కరించాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మట్టాడి వెంకట రమణ, ఎంపీపీ గుర్రాల జ్యోత్న్స, ఎంపిడివో కె. రమేష్‌కు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మట్టాడి విలేకరులతో మాట్లాడుతూ గత మూడు నెలల నుండి నేటి వరకూ పంచాయతీ కుళాయి నీరురాకపోవడంతో ముగ్గళ్ళ గ్రామంలో దళితవాడలో నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించడానికి తాత్కాలిక పద్ధతి కాకుండా శాశ్వత పరిష్కార మార్గం చూపాలని కోరారు. త్వరితగతిన మండల, జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో మంచినీటి సమస్యను తీర్చకపోతే ప్రతీ ఇంటి నుండి మంచినీళ్ల బిందులతో రహదారిపై బైఠాయించి మంచినీటి సమస్య పరిష్కారానికి మహిళలు చేసే నిరసన దీక్షకు నా వంతు సహకారాన్ని అందిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముగ్గళ్ళ అంబేద్కర్ యూత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన రెండు ద్విచక్ర వాహనాలు

విశాలాంధ్ర - సీతానగరం : రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాపాక తూములు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. చిన్నకొండేపూడి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సత్యనారాయణ విధులు ముగించుకుని రాజమండ్రి వైపు వెళుతుండగా వెల్లంపేటకు చెందిన మోహన అనే వ్యక్తి ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల ఢీకొనడంతో ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు జనసేన అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. మోహనకు కూడా గాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర - కరప : కరప మండలం గురజానపల్లి గ్రామంలో పోలీసులు పేకాట శిబిరంపై దాడులు జరిపి ముగ్గురు పేకాట జూదగాళ్ళను అదుపులో తీసుకున్నామని ఎస్సై నౌదు రామకృష్ణ తెలిపారు. ఈ శిబిరం నుండి 35 వేల, పది రూపాయలు నగదు, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని జూదరులపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో పోలీస్ కానిస్టేబుల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముఖ్యమంత్రి పర్యటన

- ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-యలమంచిలి : ముఖ్యమంత్రి ఆదివానం యలమంచిలి మండలం కలగంపూడిలో పర్యటన ఏర్పాట్లు పూర్తయ్యా యని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శనివారం యలమంచిలి మండలం కలగంపూడి హెలిప్యాడ్ ను , కల్యాణ వేదికను జిల్లా యస్ పి యు.రవి ప్రకాష్, జిల్లా ఇంచార్చి జిల్లా జాయింటు కలెక్టరు యం సూర్య తేజ తో కలసి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. హెలిప్యాడ్ దగ్గర సేఫ్టీ హౌస్ , విఐపి లు వేచి ఉండే గ్యాలరీ ని పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టరు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ శాఖలు వారీగా కేటాయించిన విధులు బాధ్యతతో నిర్వర్తించి ఎక్కడా ఏ చిన్న పొరపాటు దొర్లకుండా చూసి పర్యటన విజయవంతం చేయాలన్నారు.శానిటేషన్ ,బారి కేట్స్ ,వాహనాలు పార్కింగ్ పక్కగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ లైట్స్ ఏర్పాట్లు చెయ్యాలని , విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకుని , జనరేటర్ సిద్దం చేసుకోలన్నారు.

హెలిప్యాడ్ దగ్గర మంచి నీటి సదుపాయం తో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

ముఖ్య మంత్రి హెలికాప్టర్ దిగి తిరిగి వెళ్ళే వరకూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించి పర్యటన విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. ఉదయం హెలికాప్టర్ ట్రయిల్ నిర్వహించారు. సాయంత్రం వాహనాల ట్రయిల్ రన్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు ముదునూరి. ప్రసాద రాజు, వివిధ శాఖల జిల్లా,డివిజన్,మండల అధికారులు, తది తరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్ బహూకరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కైకరంలో జీవిత బీమా సంస్థ భీమడోలు డివిజన్ వారు ఎల్ఐసి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 2021 - 22 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి పదవ తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డ్స్ బహూకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు , ముఖ్య అతిథి భీమడోలు డివిజన్ బ్రాంచ్ మేనేజర్ కె. గోవిందు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న వయసు నుంచి పొదుపు అలవాటు చేసుకోవాలని, జీవిత బీమా లో పొదుపు చేసుకోవడం వల్ల భవిష్యత్తులో వారిని ఆదుకుంటుందని తెలిపారు, మరో అతిథి ఎల్ఐసి భీమడోలు డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ కూన అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలన్నారు. బాగా చదువుకున్న వారికి ప్రతి సంవత్సరం ప్రశంసా పత్రాలు మెడల్స్ స్కాలర్షిప్ప ఎల్ఐసి తరఫున అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు రాంబాబు, సత్యనారాయణ మూర్తి, కోనే సత్యనారాయణ, కూన చిన్న అప్పారావు, యాకోబు, ఉపాధ్యాయులు డాక్టర్ జె సాయిరాం, పీవీ కన్నారావు జి. గవరయ్య పాల్గొన్నారు.

నేడు మహిళా విద్యా సాంస్కృతిక సమ్మేళనం

విశాలాంధ్ర-ఏలూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ విద్యాసాంస్కృతిక సమ్మేళనం జరుగుతుందని పలు సంఘాల నాయకులు తెలిపారు. శనివారం స్థానిక ఐద్వా, ఏవిఆర్ విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు. కాలేజీల విద్యార్థినులు, టీచర్లు, లెక్చరర్లు, శ్రామిక మహిళలు, గృహిణులకు వివిధ రకాల పోటీలు, అనంతరం సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. పి. కస్తూరిబాయి, ఏబీ త్రిపుర సుందరి, జి. శారద (ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రం), పి హైమావతి,కె విజయలక్ష్మి, ఎస్ కే పర్వీన్ బేగం, మహిళా విద్యా సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమం వివరాలు పత్రికలకు తెలిపారు.పవర్ పేటలోని ఐద్వా, ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆఫీసులో మహిళా నాయకులు తెలిపారు. ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన కాలేజీల విద్యార్థునులు, మహిళలకు మహిళా సమస్యలపై చిత్రలేఖనం, అభ్యుదయ గీతాలు పాడటం, మహిళా సమస్యలపై మూడు నిమిషాల ప్రసంగం, అంతర్జాలంలో అన్వేషణ, వినూత్నమైన ఆటలు నిర్వహించి ఒక్కొక్క అంశంలో ముగ్గురికి బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు పాటల పోటీలతో ఏలూరులోని పవర్ పేట నందు ఉన్న ఉద్ద రాజు రామం భవనం నందు విద్యా సాంస్కృతిక సమ్మేళనంను మానవతా ఏలూరు మండల చైర్మన్ అడుసుమిల్లి నిర్మల ప్రారంభిస్తారని తెలిపారు. పోటీల విజేతలకు ఒక్కో అంశంలో మూడు చొప్పున బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామనితెలిపారు. సభకు ముఖ్యఅతిథిగా ప్రజాస్వామ్య రచయితలు వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ కె ఎస్ మల్లేశ్వరి హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమాన్ని ఏ మోహిని, డాక్టర్ కే అరుణ, ఎం గంగాభవాని, కోటిపల్లి రాజ్యలక్ష్మి, జి. నీలిమ, పి. అలేఖ్య, వి. సాయి సుధా, ఏ ఉషారాణి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

విధి నిర్వహణలో లైన్‌మెన్‌లు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కలిదిండి : విధి నిర్వహణలో లైన్‌మెన్ లు అప్రమత్తంగా ఉండాలని ఏఈఈ జి.మల్లికార్జున సిబ్బందికి సూచించారు. శనివారం కలిదిండి మండల విద్యుత్ కార్యాలయంలో జాతీయ లైన్ మ్యాన్ దివాస్, విద్యుత్తు భద్రతా వారం సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తమ పరిధిలోని వినియోగదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. సిబ్బంది భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్‌లు, ఏఎల్ఎంలు, జేఎల్ఎం లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆశయాలకు అనుకూలంగా పనిచేయాలి

విశాలాంధ్ర - నిడమర్రు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పార్టీ క్యాడర్‌ను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేయాలని దానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. శనివారం నిడమర్రు మండలం బువ్వనపల్లిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల నూతనంగా నియమితులైన ఏలూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు శాసనసభ్యులు వాసుబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక పథకం ద్వారా ఆ కుటుంబానికి లబ్ధి చేకూర్తున్న విషయాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గంటా ప్రసాదరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు పుప్పాల గోపి,దొంతంశెట్టి సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు పేరా ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి కళ్యాణం

విశాలాంధ్ర- కాళ్ళ : మండల కేంద్రమైన కాళ్ళ గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శనివారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలతో తొలుత స్వామివారికి నైవేద్యం సమర్పించి, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు, దాతల ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ అన్నసమారాధనకు చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా దాతలను పలువురు గ్రామస్తులు, పెద్దలు అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ గనిశెట్టి షణ్ముఖేశ్వరరావు, ఆలయ ఈవో కూచంపూడి శ్రీనివాసరాజు, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి మంచిరోజులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: టిడిపి అధికారంలోకి వస్తే ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వచ్చినట్లే నని అందుకు నిదర్శనం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అని పోలవరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు పేర్కొన్నారు. లోకేష్ చేపట్టిన పాదయాత్ర 34 రోజుకు చేరుకోవడంతో మొడియం శ్రీనివాసరావు శనివారంలోకేష్ తో కలిసి పాదయాత్ర కొనసాగించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగరవేస్తుందని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరల పరిపాలన కొనసాగిస్తారన్నారు. రాష్ట్రం అభివృద్ధి దశలో ముందుంటుందని అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్రకు మంచి స్పందన వస్తుందని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర-చింతలపూడి: శనివారం చింతలపూడి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ పరిధి లో గల లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లి గ్రామంలో చింతలపూడి సెబ్ సిబ్బంది దాడులు జరిపి వెస్ట్ యడవల్లి గ్రామానికి చెందిన ఈడ చంద్రారావు అనే వ్యక్తిని అరెస్టు చేసి ఆతని వద్ద నుండి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 88 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇతనికి సప్లయర్ అయిన యర్రంపల్లి గ్రామానికీ చెందిన వీరంకి సత్యనారాయణపై కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లింగపాలెం మండలం బోగోలు గ్రామానికి చెందిన పలగాని రాము అనే వ్యక్తి బైండోవర్ బ్రీచ్ అయినందున లింగపాలెం తహశీల్దారు రూ. 15వేలు రూపాయిలు జరిమానా విధించారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర - కలిదిండి: పెంచిన గ్యాస్ ధరలకు వెంటనే తగ్గించాలని సిపిఐ ఎం ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ బండలు, కట్టెలతో ప్రదర్శన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. శనివారం కలిదిండి సెంటర్ లో పార్టీ మండల కార్యదర్శి శేషపు మహంకాళి రావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చేసరికి గ్యాస్ బండ ధర రూ. 400 లు ఉంటే రూ. 1250 లకు పెంచారని మళ్లీ ఇప్పుడు అదనంగా సాధారణ బండకు రూ. 50 లు కమర్షియల్ బండకు రూ. 450 లు పెంచడం దుర్మార్గమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకపక్క పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు కల్పిస్తూ సామాన్యులపై అధిక ధరల భారాలను మోపుతుందని, నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే సామాన్యుల బ్రతుకులు దుర్భరంగా మారుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు ఈ విధంగా ఉంటే రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు పన్నెత్తుమాట కూడా మాట్లాడకపోవడం విచారకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు వీరవల్లి. భాస్కరరావు,గంట. రఘురాం ప్రసాద్ కార్యకర్తలు జక్కుల. మహేష్ ,కుడుపూడి. శ్రీనివాసరావు, పెనుమాల. రమేష్, పెరుమాళ్ళ. సత్యనారాయణ, పంతగాని. ప్రకాష్, గద్దె. అనిల్ కుమార్ , అబ్దుల్ హకీం, కాంగ్రెస్ నాయకులు మారుబోయిన శ్రీనివాసరావు, ఆటో వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిలు చదువుతోపాటు వంట నేర్చుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: చదువుతోపాటు విద్యార్థినిలు వంట కూడా నేర్చుకోవాలని చింతలపాటి వరప్రసాద్ మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. శనివారం కళాశాలలో వంటల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన అంతర్జా తీయ మహిళా దినోత్సవం, ఐక్యరాజ్య సమితి (యు ఎన్ బి) 2023ను అంతర్జా తీయ తృణ ధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం వలన వీటిని పురస్కరించుకుని కళాశాలలో మహిళా సాధరికత విభాగం తరపున కళాశాల విద్యార్థినులకు రకరకాల వంటలు పోటీలు నిర్వహించినట్టు ఆమె తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి మధురాజు, డివివి చిన సత్యనారాయణ, శ్రీనివాసరావు, డాక్టర్ కేకే సత్యనారాయణ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

చింతలపూడి టీడీపీ టికెట్ లోకల్ అభ్యర్థికే ఇవ్వాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టికెట్ లోకల్ అభ్యర్థికే కేటాయించాలని కోరుతూ శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయు డుకు ఎస్సీ సెల్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయుడు ను కూడా మర్యాదపూర్వంగా కలిసి 2024లో చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ లోకల్ అభ్యర్థికే కేటాయించాలని అభ్యర్థించారు. స్థానికులకే ఇక్కడి పరిస్థితులు అర్థమవుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బొబ్బర రాజు పాల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను, నియోజవర్గ ఐటీడీపీ అధ్యక్షులు బోడా అనీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా వుండాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా వుండాలని లీడ్ బ్యాంక్ సమన్వయ కర్త విశ్వప్రసాద్ తెలిపారు. బొర్రంపాలెం కెనర బ్యాంక్ వద్ద ఏలూరు లీడ్ బ్యాంక్ వారి సహకారంతో ఖాతా దారులకు ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంక్ ఆన్ లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేనేజర్ గాజుల గణేష్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలతో ఆపన్న దశలో ఆసరా

విశాలాంధ్ర-మండవల్లి: బీమా పథకాలు ఆపన్న సమయంలో కుటుంబా నికి ఆర్థిక భరోసా నిస్తాయని మండవల్లి ఇండి యన్ బ్యాంకు మేనేజర్ బి.దుర్గారావు అన్నారు.పిఎం జీవన్‌జ్యోతి భీమా యోజనలో ఒక్క వాయిదా మాత్రమే చెల్లించి మృతి చెందిన మండవల్లికి చెందిన గంగునేని చిన్నారావు కుటుంబ సభ్యులకు బీమా పరిహారం రెండు లక్షల చెక్కును శనివారం బ్యాంకు అధికారులు అందించారు. ఈసందర్భంగా మేనేజరు దుర్గారావు మాట్లాడుతూ జీవన్‌జ్యోతి భీమా యోజన,సురక్షాభీమా యోజనలోచేరి 456 రూపాయలు ప్రీమియం ఏడాదికి చెల్లిస్తే సహజమరణానికి రెండు లక్షలు,ప్రమాదమరణంతో కలిపి నాలుగు లక్షలు అందిస్తామన్నారు.భీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆటో డెబిట్ద్వారా నగదు ప్రీమియం చెల్లింపు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం బ్యాంకులద్వారా అందించే పథకాలపైనా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ మెండాజాన్సి,ఐక్యవేదిక నాయకులు భాస్కరరావు, వైసీపీ నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్, ఏలూరు జిల్లా కలక్టరు వారి ఆదేశాలను అనుసరించి, యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్ వారి ఆధ్వర్యంలో శనివారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, దెందులూరు నందు 9వ మరియు 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ గైడెన్సు పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు సెట్ వెల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి యం.డి. హెచ్. మెహరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెట్ వెల్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి యం.డి. హెచ్. మెహరాజ్ విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సందేశం ఇచ్చారు. యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఆర్.విజయ కుమార్, ప్రధానోపాధ్యాయులు పి.వి. రామ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్ళడానికి లక్ష్యం కృషి ఉంటే ఋషులు అవుతారని, పట్టుదలతో చదివి జ్ఞానం సంపాదించాలని జ్ఞానంతో లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు పి.వి. రామ శర్మ, కెరీర్ కౌన్సిలర్, ఆర్.విజయ కుమార్, టూరిజం మేనేజర్ యస్. పట్టాభి రామన్న, ఎ.ఓ. కె.జె.కెనడి పాఠశాల అధ్యాపక సిబ్బంది, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర-భీమడోలు: భీమడోలు గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు గొట్టపు వాసుదేవరావు ప్రమాదంలో మరణించారు. కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల బీమా చెక్కును శనివారం భీమవరంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అందచేశారు. వారితో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు,ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు గారు, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండ లం ఉప్పాకపాడులో ఫౌండేషన్ ప్లస్ పాఠశాలను ఉంగుటూరు ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి ఆంజనేయులు శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నాడు నేడు, జగనన్న గోరు ముద్ద, మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాలలో జరుగుతున్న నో బ్యాగ్ డే కార్యక్రమం, రికార్డులు తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు అల్లు శ్రీను, ఉపాధ్యాయులు మాదు రాణి, మధ్యాహ్న భోజన సిబ్బందిని, శానిటేషన్ వర్క్‌ని అభినందించారు.

పతనం దిశగా జగన్ ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : అవినీతి, అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని అంధకారమయంగా మార్చిన జగన్మోహనరెడ్డి పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, రాబోయే ఎన్నికలలో ఈ ప్రభుత్వ పతనం ఖాయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం స్థానిక 10వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, యువ నాయకులు వాసిరెడ్డి బాబీ, డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. డివిజన్లో ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మమేకమయ్యారు. జగన్ పాలన ఎలా ఉందని తెదేపా నాయకులు అడగ్గా ప్రజలు తమ బాధలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షులు రెడ్డి మనేశ్వరావు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, కార్యదర్శి మహబూబ్ ఖాన్, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర - జగ్గంపేట : కాకినాడ జిల్లా రామవరం గ్రామ శివారు హెచ్‌పి బంక్ ప్రక్కన రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ తమ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాటరాయలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1900 లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిని సోమవారం ఉదయం కోర్ట్‌లో హాజరు పరుస్తామన్నారు.

నెక్సాన్ ఈవి కే టూ కే డ్రైవ్ రికార్డ్స్

విశాలాంధ్ర-రాజమండ్రి : భారతదేశపు ప్రముఖ ఆటోమొబైల్ తయారీదారు ఈవి పరిణామానికి మార్గదర్శక టాటా మోటార్స్ డ్రివెన్ ఈవి నెక్సాన్ కాశ్మీర్ నుండి కన్యాకుమారి డ్రైవ్‌ను కవర్ చేయడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విజయవంతంగా ప్రవేశించిందని ప్రకటించింది. నెక్సాన్ ఈవీ - భారతదేశపు నంబర్ వన్ ఎలక్ట్రిక్ వాహనం 4003కిలోమీటర్ల డ్రైవ్‌ను కేవలం 95 గంటల 46 నిమిషాల్లో (4 రోజులలోపు) పూర్తి చేసిందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ డైరెక్టర్ మిస్టర్ శైలేష్ చంద్ర చెప్పారు. బహుళ-నగర ప్రయాణాలను అత్యంత సామర్థ్యంతో విజయవంతంగా రుజువు చేసిందని, ఇంకా, ఈ నాన్-స్టాప్ డ్రైవ్ భారతీయ రహదారి మార్గాలలో ఉన్న మెరుగైన నిరంతరాయ పబ్లిక్ ఛార్జింగ్ నెట్‌వర్క్ కారణంగా కూడా సాధ్యమైంది అని చెప్పారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు కష్టాలు

విశాలాంధ్ర - కొత్తపేట : వైసీపీ ప్రభుత్వంలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర రైతు టిడిపి ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించారు. శనివారం కొత్తపేట మండలం పలివెల గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రైతులు వద్దకు వెళ్లి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ వరి చేలలో దిగితే కాలికి మట్టి కూడా అంటని పరిస్థితిని, సాగునీరు అందక పంట పొలాల భూములు పొడిబారి పోవటం చరిత్రలో ఎన్నడూ చూడలేదన్నారు. ఆ ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీను, బండారు సత్తిబాబు, జక్కంపూడి వెంకటస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి ఆదాయం రూ.13 లక్షలు

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలంలోని చింతలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాంబికా అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా శనివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహోత్సవ వేలం పాటలలో రామచంద్రపురం దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ బాలాజీ రామ్ ప్రసాద్ పర్యవేక్షణలో జరుపగా పసుపు, కుంకుమ అమ్ముకునేందుకు గాను గత సంవత్సరంలో రూ.27 వేలు రూపాయలు వేలం పాట పలుకగా ఈ సంవత్సరం మార్గాని ఏసు 38 వేల రూపాయలకు, కోళ్లు, కొబ్బరి చెక్కలు, అరటి పళ్ళ పోగుచేసుకునే హక్కుకు గాను గత సంవత్సరంలో రూ.2 లక్షల 73 వేలు వేలం పాట పలుకుగా ఈ సంవత్సరం పాలింకి వెంకటేశ్వరరావు 3 లక్షల 25 వేల రూపాయలకు, వారబోయు హక్కు గతంలో రూ.2 లక్షల 55 వేలు పలుకుగా ఈ సంవత్సరం వైట్ల శేషుబాబు 3 లక్షల 51వేల రూపాయలకు, తుల్లబిళ్ళకు గతంలో రూ.2 లక్షలు వేలం పాట పలుకగా ఈ సంవత్సరం వైట్ల శేషుబాబు 2, లక్ష 50వేల రూపాయలకు, చీరలు, రవిక గత సంవత్సరం రూ.3, లక్షల 55 వేలు వేలం పాట పలుకగా ఈ సంవత్సరం బుల్లిరెడ్డి నూకరాజు 4 లక్షల 02, వేల రూపాయలకు పాటదారులు దక్కించుకోగా మొత్తంగా గత సంవత్సరం రూ.11లక్షల 10. వేలు ఆదాయం రాగా ఈ 2023 సంవత్సరమునకు గాను13 లక్షల 66 వేలు అధిక స్థాయిలో ఆదాయం వచ్చిందని ఈవో ఉండవిల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. గత ఏడాది జాతర పాటలు కంటే ఈ ఏడాది రూ 2 లక్షల 56 వేలు అధిక ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, గ్రామ సర్పంచ్ మార్గాని కరుణ ఏసు, ఉప సర్పంచ్ మోరంపూడి వాసు, ధర్మకర్తలు తొంటా సుబ్రమణ్యం, ఈదర నారాయణరావు, పాలంకి ధనవంతరి శర్మ, రోళ్ల శ్రీనివాస్, దొడ్డిపట్ల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలి

విశాలాంధ్ర-భీమవరం: గర్భిణీలలో రక్తహీనత తలెత్తకుండా తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ వైద్య అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీల మరణాలకు రక్తహీనత అనేది ప్రధాన అంశంగా పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు రక్తహీనతకు గురైతే వారిలో పెరిగే శిశువు కూడా సరైన ఎదుగుదల ఉండదన్నారు. గర్భిణీ స్త్రీలకు రక్తహీనత వలన కలిగే అనర్థాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మల్టీ పర్పస్ హెల్త్ సూపర్వైజర్లు రక్త పరీక్షలను నిర్వహించి వారికి తగిన మందులను అందజేయా లన్నారు. అవి టాబ్లెట్స్, ఇంజక్షన్స్ తదితర ప్రత్యామ్నాయ మార్గా లలో వారికి ఇష్టమైన రీతిలో మందులను తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధ, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా ఎచీవర్స్ డే

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల ప్రాంగణంలో 2022-23 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ చదువుతూ వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బిటెక్ పట్టాతో పాటు మంచి కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం అనేది ఆదిత్య ఆశయం. ఆవిధంగా విజయం పొందిన విద్యార్థినీ, విద్యార్థుల తల్లితండ్రులకు ఆదిత్య యాజమాన్యం వినూత్న రీతిలో అభినందన పూర్వక సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థలు మూడున్నర దశాబ్దాలుగా కెజి నుండి పిజి వరకు నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థి, తల్లితండ్రుల మన్ననలను, విశ్వాసాన్ని పొందుతూ రాష్ట్రంలోని విద్యార్థులకే కాకుండా దేశ,విదేశాలలో గల ఎందరో విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ఇవ్వడమే కాకుండా మంచి కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు కూడా పొందేలా చేసి వారి జీవితాలకు బంగారు బాటలు వేస్తూ ముందుకు సాగుతుంది. ఇంజినీరింగ్‌లో ప్రవేశించిన నాడు అన్న మాట ప్రకారం డిగ్రీ పట్టాతో పాటు మంచి ఉద్యోగ నియామక పత్రాలతో బయకు పంపిస్తామనే మాటను ఎప్పటి లాగే నిజం చేస్తూ అందుకు తమ వంతు సహకారాన్ని అందించిన విద్యార్థుల తల్లి, తండ్రులను అభినందిస్తూ వినూత్నంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ మాట్లాడుతూ విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ ఆర్థిక క్రమశిక్షణ అవసరమని మీ విజ్ఞానాన్ని మరింతగా పెంచుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహిచాలని సూచించారు. ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి ఇప్పటి వరకు 100కు పైగా కంపెనీలప్రాంగణ ఎంపికలలో (2300ం) ఉద్యోగాలు పొందారని తెలిపారు. అనంతరం వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లితండ్రులను యాజమాన్యం తరుపున ప్రశంసా పత్రం, జ్ఞాపిక, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డా మేడపాటి శ్రీనివాసరెడ్డి, డా డోలా సంజయ్, ఎస్, డా ఆదిరెడ్డి రమేష్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లితండ్రులు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.